కథ

# అల్లులు

## పుట్టగంటి గోపీకృష్ణ

ఉదయం కృష్ణా ఎక్స్‌ప్రెస్ తిరుపతిలో బయలుదేరినప్పుడే వానపడుతోంది. అప్పటికే బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం, తీవ్రమయిన తుపానుగా మారిందని వస్తున్న ఎనౌన్స్‌మెంట్‌ని టీవీలో చూసాడు ప్రసాద్.

ప్రసాద్, భార్య వాణి, పిల్లలు శృతి, సంపత్‌లు అమెరికానుండి వచ్చి ఇరవై రోజులయింది. రెండు రోజుల క్రితం తిరుపతి వచ్చారు. క్రితంరోజే దర్శనం అయింది. కానీ వాతావరణం అనుకూలించక ప్లేన్ కాన్సిల్ అవటంతో వారి ప్రయాణం కూడా వాయిదా వేసుకోవాల్సి వచ్చింది. అమెరికా ప్రయాణం నాలుగు రోజుల్లో ఉండటం, ఉదయానికి కూడా వాతావరణంలో మార్పు లేకపోవటంతో ట్రైన్‌లో బయలుదేరారు.

తనకి ఇష్టమయిన టెడ్డీబేర్ బొమ్మతో ఆడుకుంటూ కబుర్లు చెప్తుంది పన్నెండేళ్ల శృతి. శృతికి ఆ బొమ్మతో చాలా అటాచ్‌మెంట్. ఎప్పుడూ తన దగ్గరే ఉంచుకుంటుంది, ఆఖరికి నిద్రపోతున్నప్పుడు కూడా!

ట్రైన్ మరీ స్లో అయినట్లు అనిపించింది ప్రసాద్‌కి. లేచి కంపార్ట్‌మెంట్ డోర్ దగ్గరికి వచ్చాడు. డోర్ తెరచి బయటకు చూసాడు.

లోపల పెద్దగా తెలవటం లేదు కానీ, బయట వాతావరణం భీతికొల్పుతుంది. ట్రాక్ చుట్టూ వున్న పొలాలు మునిగిపోయి, ట్రైన్ ఏదో చెరువు మధ్యనుంచి వెళ్తున్నట్లు ఉంది.

గాలికి చెట్లు వికృతంగా ఊగుతున్నాయి.

నెమ్మదిగా పాకుతున్నట్లుగా నడుస్తున్న ట్రైన్ ఏదో ఒక చిన్న స్టేషన్‌లో ఆగింది. ఐదు నిమిషాలయినా బయలుదేరే సూచనలేమీ కనిపించటం లేదు. కంపార్ట్‌మెంట్ నుండి కిందకు దిగాడు ప్రసాద్.

ఒక యూనిఫారంలో ఉన్న వ్యక్తిచుట్టూ జనమంతా చేరి ఉండటం చూసి తను కూడా అటు నడిచాడు.

"ఇప్పుడప్పుడే బయలుదేరే అవకాశం లేదండి. పైన హఠాత్తుగా వాగు పొంగి ట్రాక్ కొట్టుకుపోయింది. తాత్కాలికంగా రీస్టోర్ చెయ్యాలన్నా రెండు రోజులు పడుతుంది" చెప్తున్నాడు స్టేషన్ మాస్టర్.

"ఇక్కడాపితే ఎలాగండీ..సరైన షెల్టర్ లేదు. తిండీ, నీరూ దొరికే దిక్కు లేదు. పిల్లా, పాపా ఉన్న వాళ్ళు ఏమయిపోతారనుకున్నారు?" ఎవరో ఆక్రోశం వెళ్ళగక్కుతున్నారు.

నెమ్మదిగా వార్త పాకిపోయినట్లుంది. జనమంతా కిందకి దిగుతున్నారు.

సంగతి తెలియగానే హతాశురాలయింది వాణి. "పొద్దున్న శృతి కొనమందని నాలుగయిదు చాక్‌లెట్ బార్లు, బిస్కెట్ పాకెట్లు కొన్నాను. అవి శృతి వరకూ సరిపోతాయి. కానీ సంపత్ సంగతేంటి? వాడికి ఇంకొక రెండుసార్లవరకూ పాలు కలపటానికి, వేడి నీరు ఫ్లాస్క్‌లో ఉంది. ఆ తరువాత..." సందేహంగా ఆపివేసింది వాణి.

"నేను ఊర్లోకి వెళ్ళి చూసి వస్తాను. మీరు ఇక్కడే ఉండండి. వీలయితే వేడి నీళ్ళు తెస్తాను" బయలుదేరాడు ప్రసాద్.

బేలగా చూస్తూ నిట్టూర్చింది వాణి.

స్టేషన్ బయటికి వచ్చి చూసాడు ప్రసాద్. లోకమంతా వాన ముసుగు కప్పుకుని, మునగ దీసుకుని పడుకున్నట్లు ఉంది.

స్టేషన్ నేలమీద కూర్చుని చుట్ట కాలుస్తున్నాడు ఒక తను. ప్రసాద్ సంశయాన్ని గమనించి చెప్పాడు "ఒక కిలోమీటరు దూరం ఈ దారినే పోవాల ఊర్లోకి పోవాలంటే. ఆడయినా ఏటుండాది? ఏమి దొరికి సస్తయ్..ఈ వానలో"

ఆ మాటల్ని పట్టించుకోకుండా ముందుకు నడిచాడు. ధారగా పడుతున్న వానకి, ఈదురుగాలి తోడయి సూదులు గుచ్చుతున్నట్లు ఉంది. లోపల నుంచి తన్నుకొస్తుంది వణుకు.

దాదాపు అరగంట పట్టింది ఆ కిలోమీటరు నడవటానికి.

ఊర్లో ఎక్కువ పూరిపాకలే వున్నాయి. అక్కడక్కడా పక్కా ఇళ్ళు కనిపిస్తున్నాయి.

దగ్గర్లో కనిపించిన ఒక పెంకుటింటి ముందు నిలబడి తలుపు తట్టాడు.

లోపలనుండి "ఎవరూ?" అంటూ ఒక గొంతు వినిపించింది. సమాధానం కోసం ఎదురు చూడకుండానే తలుపులు తెరుచుకున్నాయి.

తలుపు తెరిచిన వ్యక్తికి సుమారు అరవై సంవత్సరాలు ఉండొచ్చు. పంచె కట్టు..పైన ఏమీ ఆచ్ఛాదన లేదు. చాలా అరుదుగా షర్ట్ వాడతాడేమో వళ్ళంతా కమిలిపోయి, ఒకే ఛాయలో ఉంది.

అతను చాలా త్వరగా ఆశ్చర్యం నుండి తేరుకుని- "ముందు లోపలికి రండి బాబూ..తడిసి పోతున్నారు" అని ఆహ్వానించాడు.

లోపలికి వెళ్ళిన ప్రసాద్‌కి, ఒక పాత చెక్క కుర్చీ తెచ్చి వేసాడు ఒక కుర్రాడు.

"తల తుడుచుకుంటారేమో, ఒక తుండు గుడ్డ యియ్యరా" అన్నాడు పెద్దాయన ఆ కుర్రాడితో.

ఆ కుర్రాడిచ్చిన టవల్‌తో తల తడుచుకుంటుంటుంటే, దానిలో నుండి ఒక రకమయిన వాసన వచ్చింది. అసహ్యం మొహంలో ప్రతిఫలించకుండా జాగ్రత్త పడుతూ..తల తుడుచుకుని టవల్ కుర్రాడికిచ్చాడు.

కాస్త తేరుకున్నాక తన పరిస్థితినంతా వివరించాడు ప్రసాద్.

అతి తక్కువ సమయంలోనే పరిస్థితినంతా అంచనా వేసాడు పెద్దాయన. "ఈ వానలో చలిలో..ఆ రైల్లో...చంటాళ్ళ నేసుకుని ఉండటం మంచిది కాదేమో! రైల్లో ఉన్న అందరికీ సాయం చేయలేకపోయినా ఎతుక్కుంటూ నా యింటి కొచ్చావ్. వేరే శంకలేమీ లేకపోతే వాళ్ళని కూడా ఇక్కడికి తీసుకు వద్దాం" అన్నాడు.

ప్రసాద్‌కేమి చెప్పాలో అర్థం కాలేదు.

"ఇల్లు చిన్నదని ఆలోచిస్తున్నావేమో..పర్లేదు బాబూ..ఉన్న దాంట్లోనే సర్దుకుందాం. రేపటికల్లా తుపాను తగ్గితే హైదరాబాదు ఎంతలో పోతారు" పెద్దాయన అలా మాట్లాడుతుంటే ప్రసాద్‌కి ఎక్కడలేని ధైర్యమొచ్చింది.

ప్రసాద్ మౌనాన్ని అంగీకారంగా భావించి ఆయన వాళ్ళబ్బాయిని పిలిచాడు - "ఒరేయ్ రవీంద్రా..నాయుడుగారి ట్రాక్టరు తీసుకుని టేషన్ కాడికి పోయిరా..పోయి...అమ్మాయినీ, పిల్లలనీ తీసుకురండి"

ఏం చేసినా, ఇంటికి వచ్చేటప్పటికి వాణి, పిల్లలూ పూర్తిగా తడిచి పోయారు. అసహాయంగా, తడిచిపోయిన గువ్వల్లాగ ఉన్న వారు ఒక గంటలో, ఆ యింటి వారి సహకారంతో, రెక్కలు విప్పుకున్న కోడి పిల్లల్లాగా తయారయ్యారు.

ఇంట్లో అక్కడక్కడా బొట్లు బొట్లుగా నీరు కారుతుంది. వాటి కింద చిన్న చిన్న పాత్రలు పెట్టి, అవి వాన నీటితో నిండగానే తీసుకెళ్ళి బయట పారబోస్తున్నారు.

నెమ్మదిగా ఆ యింటి విషయాలు ఒకటొకటిగా తెలుసుకున్నాడు ప్రసాద్..పెద్దాయన పేరు పరంధామయ్య. ఇద్దరు పిల్లలు. అమ్మాయికి పెళ్ళయింది. వాళ్ళ అత్తగారిది దగ్గర ఊరే. ఆవిడకి మూడేళ్ళ కొడుకు. ప్రస్తుతం రెండవ కానుపు కోసం పుట్టింటి కొచ్చి వుంది. తరువాత వాడు రవీంద్ర. ఇంజనీరింగ్ చదివాడు. అమెరికా వెళ్ళి ఎమ్మెస్ చెయ్యాలనే ప్రయత్నాల్లో ఉన్నాడు.

ప్రసాద్‌కీ, వాణికీ చాలా ఇబ్బందిగా, ఇరుకుగా ఉంది ఆ ఇంట్లో. లౌక్యం తెలిసిన వాళ్ళు కావటంతో, లోపలి భావాలు బయట పడకుండా మేనేజ్ చేస్తున్నారు.

శృతికి ఆ వాతావరణం చాలా కొత్తగా వింతగా ఉంది. పల్లెటూళ్ళనీ, పేదరికాన్నీ ఇంత దగ్గరగా పరిశీలించే అవకాశం ఎప్పుడూ రాలేదు.

పరంధామయ్య మనవడికి, వీళ్ళు వచ్చిందగ్గరి నుంచీ శృతి చేతిలో ఉన్న బొమ్మమీద నుంచి చూపు మరలటం లేదు.

వాడు ఇంత అందమయిన బొమ్మని ఎప్పుడూ

చూడలేదు.

చురుకైన కళ్ళూ, తీరైన ఆకృతీ, చూడగానే ఆకట్టుకునేలా ఉన్నాడు. చివరికి ధైర్యం చేసి శృతిని అడిగాడు.

"ఆ బొమ్మ ఇవ్వవా..ఆడుకునిత్తాను"

"సారీ..ఈ బొమ్మ ఎవరికీ ఇవ్వను" దృఢంగా చెప్పింది శృతి.

ఆ తరువాత వాడు దాని గురించి అడగకపోయినా, వాడి చూపు మాత్రం ఆ బొమ్మ మీద నుంచి మరల్చలేక పోతున్నాడు.

ఆపకుండా పడుతున్న వానలకి ఇల్లంతా ఒక రకమయిన దుర్వాసన వస్తుంది.

సాయంత్రానికి వాన నెమ్మదించింది. చీకట్లు కమ్ముకున్నాయి. కరంటు నిన్నటినుండే లేదు. ఆడవాళ్ళు దీపాలు వెలిగిస్తున్నారు.

పరంధామయ్య కుటుంబం బలవంతంగా వడ్డించిన 'వరన్నం' పరమాణ్ణం లాగా అనిపించింది ప్రసాద్, వాణిలకు.

ప్రసాద్ ప్రోద్బలంతో, పరంధామయ్య నెమ్మదిగా తన విషయాలు చెప్పసాగాడు - "ఏం చెప్పమంటావులే నాయనా..ఉండటానికి పదెకరాల చెక్క ఉంది కానీ, అంతా మెరక భూములు. ఈ ఏడు నాలుగెకరాల్లో మిర పేసినానా...పది రోజులయితే చేతిలో పడే పంట..ఈ వానలకి కొట్టుకుపోయె. ఈడిని అమెరికా పంపటానికీ బ్యాంకీ వాళ్ళు లోను ఇస్తామన్నారు. కానీ మన సాయానికి రెండు లచ్చలయినా కావాలంట. ఇది గో ఈ బుడ్డోడున్నాడే...అమ్మాయి కొడుకు..పుటకతోనే గుండె జబ్బుతో పుట్టినాడు. ఆడి ఆపరేషనుకి లచ్చల్లోనే చెబ్తుంద్రి. అల్ల అత్తోరు అంతంత మాత్రపోల్లే..ఏదో చెయ్యాల.."

ఏం మాట్లాడటానికీ మాటలు రాలేదు ప్రసాద్‌కి. ఆ పసివాడికి ప్రమాదకరమయిన జబ్బంటే కడుపులో దేవినట్లయింది.

పొద్దుపోయింది. అంతా సద్దుమణిగింది. వాన ఉధృతం తగ్గి, సన్నగా జల్లు పడుతుంది. పరంధామయ్య గురక పెడ్తున్నాడు.

ప్రసాద్‌కీ, వాణికీ నిద్ర పట్టటం లేదు. పక్కన శృతి కూడా నిద్ర పట్టనట్లు అటూ, ఇటూ దొర్లుతుంది.

"వాణీ..ఇన్ని సమస్యల మధ్య, ఆయన ఎంత హాయిగా నిద్రపోతున్నాడో చూడు" అన్నాడు ప్రసాద్.

"ఎప్పుడన్నా ఎదురయ్యేది సమస్య. ఎప్పుడూ తోడుగా ఉండేది సమస్యెలా అవుతుంది?"

"నిజమే..మనం ఆయన నుంచి పొందిన సాయానికి ప్రతిగా ఏదన్నా చెయ్యగలిగితే బాగుంటుందేమో...రవీంద్ర అమెరికా వెళ్ళటానికి సాయం చేస్తే ఎలా ఉంటుందంటావ్?"

"బ్రిలియంట్ ఐడియా..అలాగే నాకూ ఒకటి అనిపించింది. మా అన్నయ్య హైదరాబాద్‌లో కార్డియాలజిస్టు కదా..పరంధామయ్యగారి మనవడికి ఏమన్నా హెల్ప్ చెయ్య గలుగుతాడేమో కనుక్కుందాం"

"అవును. మనకింత చేసినందుకుగానూ, మనమూ ఏదో ఒకటి చెయ్యాలి"


బయట ఇంకా సన్నగా చినుకులు పడుతున్నాయి.

ooo

విచ్చుకున్న పువ్వులాగ మబ్బుల్ని చీల్చుకుని సూర్యుడు బయటకు వచ్చాడు. వాన పూర్తిగా ఆగిపోయింది.

తలంటుకుని మలినాలన్నీ తొలగించుకున్నట్లు ఊరంతా మెరిసిపోతుంది.

పరంధామయ్య రవీంద్రకి చెప్తున్నాడు -




"సారు వాళ్ళని ట్రాక్టరు మీద ఒంగోలు పంపించే ఏర్పాటు చెయ్యరా అయ్యా....ఆడనుండి ఏ చిన్న కారో మాట్లాడుకుని హైదరాబాదు చేరతారు"

రవీంద్ర బయటికి వెళ్ళాడు ఏర్పాట్లు చూడటానికి.

వాణి పిల్లల్ని తయారు చేస్తోంది ప్రయాణానికి. ప్రసాద్ నెమ్మదిగా వాణి పక్కకి చేరాడు.

## మంచి ఆలోచనే!

**యువ హీరోయిన్ సింధు తులానీ నటించినవి కొన్ని చిత్రాలే అయినా మంచి పాత్రల్నే పోషించింది. ఎప్పటికైనా జాతీయ స్థాయిలో ఉత్తమనటిగా అవార్డు సాధించాలనేది సింధు కోరికట. *గతంలో 'పోతే పోనీ' లాంటి నటనకు ప్రాధాన్యమున్న సినిమా చేసిన సింధు తాజాగా 'బతుకమ్మ'లాంటి డీగ్లామరైజ్డ్ పాత్రని పోషించి మెప్పించింది. అయితే కమర్షియల్‌గా కెరీర్ దూసుకెళ్ళకపోయినా కూడా ఇలాంటి పాత్రల్ని ధరిస్తున్న సింధుని మెచ్చుకోవాల్సిందే అంటున్నారు సినీవిమర్శకులు.***



"రాత్రంతా ఆలోచించాను వాణీ..వచ్చే సంవత్సరం, మా తమ్ముడు అమెరికా వస్తానంటున్నాడు కదా...వాడికి అన్నీ మనమే చెయ్యాలి. ఇప్పుడు రవీంద్రకి హెల్ప్ చెయ్యటం అంటే కొద్దిగా కష్టమవుతుందేమో! అయినా బాంకు వాళ్ళు లోన్లు బానే ఇస్తున్నారంటలే, ఇప్పుడు తీసుకుని తరువాత నెమ్మదిగా తీర్చుకుంటాడు. మన వాళ్ళని కాదని, బయటి వాళ్ళకి సాయం చెయ్యటం తనకుమాలిన ధర్మంగా అనిపిస్తుంది"

"నిజమేనండీ..నాకూ అలాగే అనిపిస్తుంది. ఆయన మనవడి గురించి మా అన్నయ్యకి చెప్పాలనే ఉంది కానీ...మా వదిన సంగతి మీకు తెలుసు కదా..మన మొచ్చి వారముంటేనే మూతి ముడుచుకుంటుంది. ఇప్పుడు మనమిట్లాంటి ఫ్రీ కేసు అప్పగించామని తెలిస్తే..అమ్మో..సాధించుకు తింటుంది. అనవసరంగా దారిన పోయే దానిని తలకు చుట్టుకున్నట్లవుతుందేమో..అని ఆలోచిస్తున్నాను"

"పోనీలే తొందరపడి రాత్రే వాగాం కాదు. వెళ్తూ, వెళ్తూ ఒక వెయ్యి చేతిలో పెడ్తాను, సరిపోతుంది" అన్నాడు ప్రసాద్.

ఆప్తబంధువు వెళ్తుంటే సాగనంపినట్లు, సెండాఫ్ ఇస్తున్న పరంధామయ్య కుటుంబ సభ్యుల్ని చూస్తే గిల్టీ ఫీలింగ్ కలిగినా తన ఫీలింగ్స్ బయటపడకుండా జాగ్రత్తపడ్డాడు ప్రసాద్.

ప్రసాద్ ఇవ్వబోయిన డబ్బుల్ని సున్నితంగా తిరస్కరించాడు పరంధామయ్య.

ఏమనుకుందో కానీ శృతి మాత్రం పరంధామయ్య మనవడి దగ్గరికి వెళ్ళి "తీసుకో...కావాలన్నావుగా" అంది, తన ఫేవరేట్ డాల్‌ని ఆఫర్ చేస్తూ.

వద్దని తల అడ్డంగా ఊపుతున్న వాడి చేతిలో బొమ్మ పెట్టి "నేను ఇంకొకటి కొనుక్కుంటాలే..నువ్వు దీనితో ఆడుకో" అని వెళ్ళిపోయింది.

ప్రసాద్ కుటుంబం అమెరికా వెళ్ళి ఆరు నెలలయింది.

వాళ్ళకి పరంధామయ్య కానీ, వాళ్ళ కుటుంబం కానీ అసలు గుర్తు కూడా లేదు. ఆ రోజు కొరియర్‌లో వచ్చిన కవరు మీద ఫ్రం అడ్రస్ చూసిందాకా.

చించి చూసిన ప్రసాద్‌కి రెండు వేల ఎమిమిది వందల పద్దెనిమిది అమెరికన్ డాలర్లకి ఒక చెక్కు, ఒక లెటరు కనిపించినయ్.

లెటరు చదవసాగాడు ప్రసాద్.

"నాయనా ప్రసాదూ..

ఉభయకుశలోపరి..

నువు రవీంద్రకి ఇచ్చిన అడ్రసు కార్డు ఉండబట్టి, మా ఊరి పంతులుగారి చేత ఈ ఉత్తరం రాయిస్తున్నాను.

మీ హడావుడి జీవితాలలో, బహుశా మేము మీకు గుర్తు కూడా ఉండి ఉండమనుకున్నాము.

మొన్న శృతి పంపిన పార్శిల్ మా యింటికి చేరింది.

అది చూసినాక మీరు ఎంత ఉన్నతులో అర్థమయింది.

శృతి తన స్కూల్‌లో మా ఊరి విషయాలన్నీ చెప్పిందనుకుంటా, పిల్లలంతా కలిసి పోగు చేసిన డొనేషన్, దానితోపాటు బోలెడు బొమ్మలు మా యింటికి పంపారు.

కానీ వాటిని ఉపయోగించుకోవటానికి ప్రస్తుతం మా మనవడు బతికి లేడు.

మీరు వెళ్ళిన నెల రోజులకి, వాడి జబ్బు ముదిరిపోయింది. ఏమీ చెయ్యలేకపోయాం.

అందుకే శృతి పంపిన చెక్కుని తిరిగి పంపిస్తున్నాను. నా మనవడిలాంటి ఆ పస్నులకి మీరే దానిని చేర్చండి.

పాప పంపిన బొమ్మలు మాత్రం, ఊర్లో పిల్లలకి పంచాను. వారి చిరు జీవితాలలో, ఒక్కరోజయినా, కాస్త ఆనందానికి, మీ అమ్మాయి కారణమయిందని తెలిస్తే మీరెంత గర్వపడతారో ఊహించుకోగలను. ముఖ్యంగా మీ అమ్మాయి శృతి, తను ప్రాణప్రదంగా చూసుకునే బొమ్మని మా మనవడికి ఇచ్చినందుకు, వాడెంత సంతోషించాడో మాటల్లో చెప్పలేను. వాడి చిన్ని జీవితం చివరివరకూ, వాడు ఆ బొమ్మని తన దగ్గరే ఉంచుకున్నాడు.

రవీంద్ర అమెరికా ప్రయాణం కుదరలేదు. బాంకు వాళ్ళు అంత తేలిగ్గా ఇస్తారా లోను? ఇక్కడే ఏదో చిన్న ఉద్యోగంలో చేరాడు. మిమ్మల్నందరినీ అడిగానని చెప్పమన్నాడు.

అంత మంచి మనసు పాపకి వచ్చిందంటే, దానికి కారణం మీ పెంపకమే అని భావించి, మిమ్మల్నందరినీ ఆశీర్వదిస్తూ-

పరంధామయ్య."

ooo

ఒక పక్క పరంధామయ్య, మరొక పక్క శృతి అందనంత ఎత్తుకి ఎదిగిపోగా, వారి ముందు పిపీలికాలై నిలబడ్డ తామెంత అల్పులో అర్థమయింది ప్రసాద్, వాణీలకి.